www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 నవంబర్ 2025
5
పశ్చిమ గోదావరి

1100 సేవలు వినియోగించుకోవాలి : కలెక్టర్

భీమవరం : ప్రజాసమస్యల పరిష్కారానికి మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

దిగుబడిపై దిగాలు..!

- ఎకరాకు 30 బస్తాలు మాత్రమే దిగుబడి
- అత్యధికంగా సాగుచేసిన సంపత్ స్వర్ణపై తీవ్ర ప్రభావం
- ఖర్చులు రావడమే గగనమంటున్న అన్నదాత
- రెండు జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 24 గంటల్లోనే సొమ్ములు జమతో రైతులకు ఊరట
- వర్షాల హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ మాసూలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రైతుల్లో మాత్రం ఆనందం లేకుండా పోయింది. దిగుబడి భారీగా తగ్గడంతో రైతులకు పెట్టుబడి ఖర్చులు సైతం రాని పరిస్థితి నెలకొంది. ఈనిక, పొట్టదశలో భారీ వర్షాలు కురవడం, మొంథా తుపానుకు పొలాలు నేలకొరగడం వంటి కారణాలు దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపినట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం మాసూలు చేసిన లెక్కల ప్రకారం గత ఏడాదికంటే దిగుబడి బాగా తక్కువగా వస్తున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులు ఎక్కువగా సాగు చేసిన సంపత్ స్వర్ణ 30 నుంచి 35 బస్తాల మధ్యలోనే దిగుబడి వస్తున్నట్లు రైతులు లబోదిబోమంటున్నారు. కొన్ని చోట్ల ఎకరాకు 29 బస్తాల దిగుబడి సైతం రావడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి సాగులో ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి ఖర్చవుతోంది. రెండు జిల్లాల్లో వరిసాగులో అత్యధికంగా 80 శాతం కౌలురైతులే ఉన్నారు. ఎకరాకు 15 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వస్తున్న దిగుబడిలో కౌలు పోను కౌలు రైతులకు 15 నుంచి 20 బస్తాల వరకూ మాత్రమే ఉంటాయి. ప్రభుత్వ మద్దతు ప్రకారం 20 బస్తాలకు రూ.30 వేలకు మించి ఆదాయం రాదు. ఎకరాకు రూ.పది వేల వరకూ కౌలు రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ఎకరాకు 40 బస్తాలు ఆపైన దిగుబడి వస్తేనే రైతులకు ఖర్చులు వచ్చే పరిస్థితి ఉంటుంది. దిగుబడి తగ్గుతుండడంతో రైతుల్లో నిర్వేదం అలముకుంది. ఆరు గాలం కష్టపడినా అప్పులు మిగులుతున్నాయంటూ రైతులు తీవ్ర వేదనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది.

రెండు జిల్లాలో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

రెండు జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోలు ముమ్మరంగా మొదలైంది. ఇప్పటి వరకూ ఏలూరు జిల్లాలో 20 వేల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 20 వేల మెట్రిక్ టన్నులు మొత్తం 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు వంటి మండలాల్లో ధాన్యం కొనుగోలు జరగ్గా, ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, చింతలపూడి వంటి మండలాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతోంది. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే సొమ్ములు జమవుతుండడం రైతులకు ఊరటనిస్తోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటివరకూ రూ.28 కోట్ల వరకూ ధాన్యం సొమ్ము జమకాగా, పశ్చిమలోనూ అదేస్థాయిలో సొమ్ములు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పశ్చిమగోదావరి జిల్లాలో 2.05 లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేయగా 6.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 265 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాల్లో వరిపంట సాగవ్వగా 5.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టారు. 240 ఆర్ఎస్‌కెల ద్వారా కొనుగోలు ప్రారంభించారు. గడిచిన రెండు రోజులుగా ధాన్యం కొనుగోలు ఊపందుకుంది. ఇదే విధంగా కొనసాగితే పది రోజుల్లో పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం ఉంది. ధాన్యం సొమ్ము జమకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న పరిస్థితి నెలకొంది. ఎక్కువ మంది రైతులకు 24 గంటల్లోనే సొమ్ములు జమవుతున్నాయి. ఇది రైతులకు ఎంతగానో ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. ధాన్యం కొనుగోలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణశాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇప్పటికే మొంథా తుపానుతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూశారు. రెండు జిల్లాల్లో దాదాపు 35 వేల ఎకరాల్లో రైతులు పంటను కోల్పోయారు. పలుచోట్ల పొలాలు నేలకొరిగి నీటిలో నానడంతో ధాన్యం రంగుమారిన పరిస్థితి సైతం ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో వర్షాలు పడితే తీవ్ర నష్టం తప్పదన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. దీంతో వేగంగా ఖరీఫ్ మాసూలు పూర్తి చేసేందుకు రైతులు ప్రయత్నిస్తున్న పరిస్థితి కొనసాగుతోంది.

ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యం

- జిల్లాలో 56 ఉద్యోగ మేళాల నిర్వహణ
- మూడు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పన
- ప్రతి మూడు నెలలకోసారి ఉద్యోగ మేళా
- జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోక్‌మాన్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకూ 56 ఉద్యోగ మేళాలు నిర్వహించామన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. ప్రతి నియోజకవర్గంలో మూడు నెలలకు ఒకసారి ప్రత్యేకంగా ఉద్యోగమేళా నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్న సేవలు, ఉద్యోగావకాశాల కల్పన వంటి అంశాలపై జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోక్‌మాన్ ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎక్కడెక్కడ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేశాం. భీమవరం నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాలలో, ఆచంటలో ఐటిఐ, పాలకొల్లులో డిఎన్ఆర్, నరసాపురంలో లేస్ పార్క్, తణుకులో ఎస్‌సిఐఎం డిగ్రీ, తాడేపల్లిగూడెంలో వాసవీ డిగ్రీ, దుంపగడపలో వివికెలో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేశాం. హెడ్ ఎంబ్రాయిండింగ్, కంప్యూటర్ వర్క్, ఆఫీస్ అసిస్టెంట్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి వాటిలో శిక్షణ అందిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఎన్ఎస్‌డిసి ఆధ్వర్యంలో ప్రతి శిక్షణా కేంద్రంలో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్నవారు శిక్షణ తీసుకునేందుకు ముందుకు రావాలి.

ప్రశ్న: ఈ శిక్షణా కేంద్రాల్లో ఎంతమంది శిక్షణ తీసుకున్నారు. ఎంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించారు?

జిల్లా వ్యాప్తంగా ఏడు శిక్షణా కేంద్రాల్లో 1,359 మంది శిక్షణ తీసుకున్నారు. దీనిలో ఇప్పటి వరకూ 1,150 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం. డిగ్రీ పూర్తయిన వారు మరో 1450 మంది సర్టిఫికెట్ కోర్సు తీసుకున్నారు.

ప్రశ్న : ఇప్పటి వరకూ ఎన్ని ఉద్యోగమేళాలు నిర్వహించారు. ఎంతమందికి ఉద్యోగావకాశాలు కల్పించారు?

జిల్లావ్యాప్తంగా 56 మినీ, మెగా ఉద్యోగ మేళాలు నిర్వహించాం. వీటికి ఏడు వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. 2,720 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తయ్యింది. సుమారు మూడు వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించాం.

ప్రశ్న : రానున్న రోజుల్లో ఏమైనా ఉద్యోగ మేళాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారా?

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉద్యోగ మేళా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో ఇది అమలవుతోంది. ఇంకా ఐదు నియోజకవర్గాల్లో ఈ మేళాలు నిర్వహించాల్సి ఉంది. ఉద్యోగమేళాలకు మంచి ఆదరణ లభిస్తోంది.

ప్రశ్న: డ్వాక్రా మహిళలకు శిక్షణ అందజేసి ఏమైనా ఉద్యోగావకాశాలు కల్పించారా?

నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు బ్యూటీషన్ కోర్సులు అందుబాటులోకి తీసుకొచ్చాం. పాలకోడేరు, నరసాపురం ప్రాంతాల్లో బ్యూటీషన్ కోర్సుకు సంబంధించి శిక్షణ అందజేశాం. 40 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు కూడా అందజేశాం. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా బ్యూటీపార్లర్ పెట్టుకుంటే రుణం అందించేందుకు ఎస్‌హెచ్‌జి సంఘాలు సిద్ధంగా ఉన్నాయి. ఇతర దేశాల్లో బ్యూటీషన్‌కు మంచి క్రేజ్ ఉంది. ప్రభుత్వం అందించిన సర్టిఫికెట్‌తో ఇతర దేశాల్లో బ్యూటీషన్ చేసేందుకు వెళ్తే మంచి ఆదాయం లభించనుంది.

ప్రణాళికా బద్ధంగా ధాన్యం కొనుగోలు జరగాలి

ఆర్అండ్‌బి శాఖా మంత్రి బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - ఆచంట

అవినీతికి తావు లేకుండా ప్రణాళికా బద్ధంగా ధాన్యం కొనుగోలు జరగాలని ఆర్అండ్‌బి శాఖా మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆచంట ఎఎంసి కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ముందుగా ఆచంట పంచాయతీ పరిధి పౌర కాలనీలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను, వంగతాల చెరువు గ్రామానికి వెళ్లే సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశంతో సిఎం చంద్రబాబు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రణాళికా బద్ధంగా ధాన్యం కొనుగోలు జరగాలని అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కొన్నిసార్లు టెక్నికల్ సమస్యల వల్ల డబ్బులు జమ కాకపోతే ఆయా శాఖ అధికారులకు ప్రభుత్వం మార్గదర్శకాలను నిర్దేశించిందన్నారు. ప్రతి రైతుకూ న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రోడ్ల విషయంలో ఇబ్బందులు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం చేసిన తప్పిదాలు నేటికీ మమ్మల్ని వెంటాడుతున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వంలో గుంతలు కూడా పూడ్చ లేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. త్వరలోనే కార్పొరేషన్ ఏర్పాటు చేసి రోడ్లన్నీ బాగు చేసి గుంతలు లేని రహదారులుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ తేమ శాతం రైతు సేవా కేంద్రం వద్ద, తేడాలు ఉండకూడదని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రైతులకు ధాన్యం చెల్లింపులు 48 గంటల్లో చెల్లిస్తామని, కౌలు రైతులకు రెండు నెలల్లో ఉచితంగా బరకాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, సర్పంచులు గుబ్బల మాధవరావు, సొసైటీ అధ్యక్షులు సత్తిబాబు, భాస్కర్‌రావు, మీరయ్య, జవ్వాది బాలాజీ శ్రీనివాస్, శ్రీరామ్మూర్తి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

చిన్నారికి నడక నేర్పిన కలెక్టరమ్మ

- ఫిజియోథెరపీకి సిఫార్సు చేసిన కలెక్టర్ నాగరాణి
- కలెక్టర్ చొరవతో నడవగలుగుతున్న వికలాంగ చిన్నారి
- కృతజ్ఞతలు తెలిపిన తల్లిదండ్రులు

చిన్నారి దివ్య రాణి

ప్రజాశక్తి - భీమవరం

ఆ చిన్నారి చిన్ననాటి నుంచి వికలాంగురాలు.. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉండిపోయిన తల్లిదండ్రులకు పిజిఆర్ఎస్ మార్గం చూపించింది. చిన్నారిని భుజాన వేసుకుని ఆమె తల్లి కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించింది. చలించిపోయిన కలెక్టర్ నాగరాణి మంచి ఆలోచనతో చిన్నారిపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. సాధారణంగా వికలాంగులు పిజిఆర్ఎస్‌కు వస్తే పింఛను ఇప్పించడానికి ఆలోచన చేస్తారు. ఆ పరిధిని దాటి ఆ పాప ఎందుకు నడవడం లేదని ఆలోచించిన కలెక్టర్ ఆ చిన్నారికి ఉజ్వల భవిష్యత్తు అందించారనడంలో సందేహం లేదు. ప్రతి సోమవారమూ నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సెప్టెంబర్ 8వ తేదీన పాలకోడేరు మండలం పెన్నాడకు చెందిన అంజలి ఆమె ఏడేళ్ల కుమార్తె దివ్య రాణిని భుజాలపై మోసుకొచ్చి మా పాప నడవడం లేదు.. కనీసం వికలాంగుల పెన్షన్ మంజూరు చేస్తే ఆధారంగా ఉంటుందని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కలెక్టర్ వెంటనే ఎన్‌టిఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్‌ను పిలిచి పాపను చిన్న పిల్లల వైద్యులకు చూపించి వైద్యం చేయిస్తే ప్రయోజనం ఉంటు ందేమో అని సిఫార్సు చేయడం, వెంటనే ఆర్‌కె గాయత్రి హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యుల వద్ద పరీక్షలు చేయించడంతో 'మైల్ స్టోన్ డిలే'గా గుర్తించారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ ద్వారా పాపకి నడవడం, మాట్లాడడం 90 శాతం అవకాశం ఉందని వైద్యులు సూచించారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా పిల్లల వైద్యులతో చికిత్స ఇప్పిస్తూనే, అన్నపూర్ణ ఫిజియోథెరపీ అండ్ రిహాబిటేషన్ సెంటర్‌లో ఫిజియోథెరపీని ఇప్పించారు. ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ వేగ్నేసిన ప్రవీణ కుటుంబ పరిస్థితిని చూసి ఉచితంగా ఫిజియోథెరపీని అందించడానికి ముందుకొచ్చారు. ఇప్పటివరకు 22 సెషన్స్ అందించారు. పాపను పిజిఆర్ఎస్‌కి తీసుకొచ్చినప్పుడు కనీసం కూర్చోలేని స్థితి. నేడు లేచి నిలబడడం, ఒక వస్తువును పట్టుకుని నడవడం విశేషం. ఫిజియోథెరపీ అనంతరం స్పీచ్ థెరపీ కూడా ఇప్పించి చిన్నారికి మంచి భవిష్యత్తును అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ నాగరాణి తెలిపారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

జెసి రాహుల్ కుమార్‌రెడ్డి

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

దేవాలయాల సందర్శన మాదిరిగా ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు సందర్శించి పుస్తక పఠనం అలవాటుగా చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ మెమోరియల్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గ్రంథాలయాలకు విశేష సేవ చేసిన అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగ భూషణం, ఎస్ఆర్.రంగనాథన్ చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మన సంస్కృతిలో భాగంగా మనం దేవాలయాలు, మసీదు, చర్చిలు సందర్శన మాదిరిగానే ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాలు ఉన్నత స్థితికి రావాలంటే ప్రజల్లో ముఖ్యంగా పిల్లల్లో పుస్తక పఠనం మీద అవగాహన రావాలన్నారు. ఏదో ఒక పుస్తకం చదువుతూ ఉంటే జ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనంపై ఆసక్తి పెరిగే విధంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రంథాలయానికి 4 లక్షల రూపాయల విలువైన వాటర్ ప్లాంట్, రెండు కంప్యూటర్స్, ప్రింటర్, ఇన్వర్టర్ సదుపాయం కల్పించిన తిరుమల విద్యా సంస్థలను జాయింట్ కలెక్టర్ అభినందించారు. ఈ గ్రంథాలయంలో చదువుకొని వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించిన 20 మందిని జాయింట్ కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు వబిలిశెట్టి కనకరాజు, బలివాడ సాయి ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి న్యూటన్, అల్లూరి నరసింహరాజు, కాలిగొట్ల గోపాలశర్మ, జి.నాగరాజు, వివివిన్.మూర్తి, ఎస్‌కె.బాబాసాహెబ్, అల్లు శ్రీనివాస్, గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎసిటి సైన్స్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ బాబ్జి

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యాచైతన్య సమాఖ్య, అల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్, పెద్దాపురం, క్రియా సొసైటీ కాకినాడ వారి సంయుక్త ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన ఎసిటి సైన్స్ సెంటర్‌ను మాజీ ఎంఎల్ఎ డాక్టర్ బాబ్జి పాలకొల్లులో ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సైన్స్ సెంటర్ గురించి తల్లిదండ్రులు తెలుసుకునేలా ప్రచారం చేయాలన్నారు. ప్రస్తుత సమాజానికి ఈ సైన్స్ సెంటర్ వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. చూడడం కన్నా చేయడం ద్వారానే ఎక్కువ నేర్చుకోగలరని, అదే చిరకాలం గుర్తుంటుందని సెంటర్ ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. మరొక అతిథి ఈ సైన్స్ సెంటర్‌ని ఏర్పాటుచేసిన ఎసిటి అధినేత అల్లంరాజు రామశాస్త్రి మాట్లాడుతూ ఈ సైన్స్ సెంటర్ ద్వారా పాఠశాలలో నేర్చుకునే దాని కన్నా ఎక్కువ నేర్చుకుంటామని, కానీ ప్రతి విద్యార్థికి పాఠశాల ముఖ్యమని అన్నారు. ఇప్పటికే పెద్దాపురంలో నడుపుతున్నామని ఇప్పుడు పాలకొల్లులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలోనే మ్యాథ్స్ ల్యాబ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మరొక సంస్థ క్రియా కార్యదర్శి జగన్నాధరావు మాట్లాడుతూ పిల్లలకు తార్కిక ఆలోచన ఈ సైన్స్ సెంటర్ ద్వారా పెరుగుతుందన్నారు. విద్యా చైతన్య సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడుతూ ఈ సైన్సు సెంటర్‌ను సుమారు 6 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సైన్స్ సెంటర్‌ను పాలకొల్లు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న 100 పాఠశాలలు వినియోగించుకోవాలని కోరారు. దీనికి ఎటువంటి ఫీజు చెల్లించక్కర్లేదని అన్నారు. పాలకొల్లు ఎంఇఒ గుమ్మళ్ల వీరాస్వామి మాట్లాడుతూ ఈ సైన్స్ సెంటర్ గురించి డిఇఒతో మాట్లాడి ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ సెంటర్ సమన్వయకర్తలు యర్రా అజయ్ కుమార్, కెవి.రాయపరాజు, చినిమిల్లి వెంకట్రావు, పులఖండం శ్రీనివాస్, పోలిశెట్టి శ్రీశ్రీ మాట్లాడారు. సమాఖ్య సభ్యులు తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు, మంచెం ఉమామహేశ్వరరావు, మంచెం కనకరాజు, వంగాకరుణ్ కుమార్, చేగొండి కరుణకుమార్, డివివి.ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

బీచ్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం సౌత్, పేరుపాలెం సౌత్ గ్రామాలలో విస్తరించి ఉన్న బీచ్ పర్యాటకులతో సందడి నెలకొంది. కార్తీక మాసం ఆఖరి ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. వడ్డునవున్న వెంకటేశ్వరస్వామి, పాండురంగస్వామి, వేళ్లాంకిణి మాత, 54 అడుగుల అభయాంజనేయస్వామి, షిరిడి సాయిబాబా, అష్టలక్ష్మీ మత్స్యనారాయణస్వామి ఆలయాలను సందర్శించారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి డాక్టర్ శ్రీవేద ఆధ్వర్యాన సిఐ దుర్గాప్రసాద్, ఎస్ఐ జి.వాసు పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, ఫైర్ సిబ్బంది, మత్స్యశాఖ సిబ్బంది, పంచాయతీరాజ్ తదితర శాఖలు బీచ్‌లో విధులు నిర్వహించారు. బీచ్‌లో ప్రత్యేక ప్రాంతాల్లో భారీకేట్లు ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను నియమించారు.

రాజ్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

50 మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ


కుట్టుమిషన్‌లు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - మొగల్తూరు

మహిళలు ఆర్థికంగా బలపడేందుకు రాజ్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ జానకీరామ్, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజులు అన్నారు. మండలంలోని పేరుపాలెం సౌత్ సెంటర్ ప్రాంతంలో గంట రాజకుమార్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా పేదల అభివృద్ధే ధ్యేయంగా రాజ్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. తీర గ్రామాల్లోని 50 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందించి ఒక్కొక్కరికి సుమారు రూ.18 వేలు విలువ గల కుట్టుమిషన్లు, రూ.500 నగదు, ధ్రువ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యకులు గంటా సుందర్ కుమార్, ట్రస్ట్ వ్యవస్థాపకులు గంటా రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 2,950 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకూ డిసెంబర్ నెలాఖరు నాటికి 3 వేల కుట్టుమిషన్ల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. కుట్టుమిషన్ పొందిన లబ్ధిదారులు కొంత సేవా దృక్పదంలో వృత్తి నిర్వహించుకుని దాతకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల్లో మహిళల ఆర్థిక అభివృద్ధికి రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యాన కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచి తిరుమాని విజయలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఇంజేటి జాన్ కెనడి, పడవల సత్యనారాయణ, కొల్లాబత్తుల రవి కుమార్, డాక్టర్ తిరుమాని నర్సింహరాజు, రూపాదేవి, కాకిలేటి ఆనంద కుమార్, మాజీ సర్పంచి మేళం బన్ను, సత్తినేని త్రినాథ్, బాబ్జి, వర్ధనపు సుధాకర్ పాల్గొన్నారు.

దర్శకుడు రాహుల్ రాయ్‌కు ఎంఎల్ఎ అభినందన

ట్రైలర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ రాధాకృష్ణ

ప్రజాశక్తి - తణుకు

తణుకు పట్టణానికి చెందిన యువ దర్శకుడు రాహుల్ రాయ్ అడబాల స్వీయ రచనలో దర్శకత్వం వహించిన అటజని కాంచన్ చిత్రం ఘన విజయం సాధించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆకాంక్షించారు. ఆదివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో చిత్రం ట్రైలర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తణుకు ప్రాంతానికి చెందిన రాహుల్ రాయ్ భవిష్యత్తులో మరిన్ని చిత్రాలు రూపొందించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. ఈ చిత్రం ఘనవిజయం సాధించి ప్రేక్షకులు గుర్తించాలని సూచించారు. దర్శకుడు రాహుల్ రాయ్ తణుకు ప్రాంతానికి చెందినవాడు కావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఎల్ఎ రాధాకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో జహంగీర్ భాషా, కానూరి రాంబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన బాల్యంతో ఉజ్వల భవిష్యత్తు

మదర్ నెస్ ఫర్టిలిటీ హాస్పటల్లో జాతీయ బాలల దినోత్సవం

చిన్నారులకు ఫ్యాషన్ షో, డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

డ్రాయింగ్ వేస్తున్న చిన్నారులు

ఆరోగ్యకరమైన బాల్యంతోనే ఉజ్వల భవిష్యత్తు అని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం చాలా ముఖ్యమని మదర్‌నెస్ ఫర్టిలిటీ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ వి.వంశీ శివరామరాజు అన్నారు. ఆదివారం భీమవరం మదర్ నెస్ ఫర్టిలిటీ ఉమెన్ అండ్ చిల్డ్రన్స్ హాస్పిటల్లో జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించి ఆరోగ్య శిబిరాన్ని, చిన్నారులకు ఫ్యాషన్ షో, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిషియన్ డాక్టర్ పి.వి.చైతన్య వర్మ, ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ కలిదిండి మానస శ్రావ్య మాట్లాడుతూ డిజిటల్ యుగంలో పిల్లలు మొబైల్‌లకు ఎక్కువ సమయం గడపుతున్నారని, దీని కారణంగా వారి శారీరక శ్రమ తగ్గిపోతుందన్నారు. వారిని సరదాగా ఫిట్‌నెస్ కార్యకలాపాలకు మళ్లించడం చాలా ముఖ్యమని, తద్వారా వారు ఎల్లప్పుడూ ఫిట్‌గా, చురుకుగా ఉంటారన్నారు. అనంతరం చిన్నారులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. సీనియర్ కన్సల్టెంట్స్ డాక్టర్ గోకుల్ నాథ్, డాక్టర్ సందీప్ పంచాల, రేడియాలజిస్ట్ డాక్టర్ వి.దుర్గామౌనిక, డాక్టర్ మాధురి పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు అభినందన

ప్రజాశక్తి - పెనుమంట్ర

రక్తదానం అంటే ప్రాణదానమని నిరూపిస్తూ రక్తదానం చేసిన మండలంలోని మానవతా స్వచ్ఛంద సంస్థకు చెందిన అంబులెన్స్ డ్రైవర్ గుబ్బల శ్రీనివాస రావు తనలోని మానవత్వం చాటారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. మండలంలోని వెలగలేరు గ్రామశివారు కోమటి చెరువు ప్రాంతానికి చెందిన కొండేటి వెంకట్రావు భార్య కొండేటి సీతమ్మకు గుండె ఆపరేషన్ బుధవారం చేయుటకు రక్తం అవసరం కాగా స్థానిక మానవత అంబులెన్స్ డ్రైవర్ గుబ్బల శ్రీనివాసరావు ముందుకొచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మానవత పెనుమంట్ర యూనిట్ సభ్యులు, స్థానికులు గుబ్బల శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

బాలలు క్రమశిక్షణతో పెరగాలి

పాస్టర్ చింతల విక్టర్ బాబు

ప్రజాశక్తి - కాళ్ల

బాలలు క్రమశిక్షణతో చిన్నతనం నుంచి పెరిగితే దేశానికి, సంఘానికి ఉపయోగపడే పౌరులుగా తయారవుతారని పాస్టర్ చింతల విక్టర్ బాబు అన్నారు. మండలంలోని పెదఅమిరం సెయింట్ పాల్స్ లూథరన్ ప్రార్థన మందిరంలో ప్రపంచ సండే స్కూల్ దినోత్సవం పాస్టర్ చింతల విక్టర్ బాబు ఆధ్వర్యాన సండే స్కూల్ కన్వీనర్ అలుగు అబ్రహం అధ్యక్షతన ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్ బాబు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ సండే స్కూల్ మొట్టమొదటిగా ఇంగ్లాండ్ దేశంలో 1780 సంవత్సరంలో రాబర్ట్ రైకిస్ ప్రారంభించారని, మన భారతదేశంలో 1905వ సంవత్సరంలో ప్రారంభించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివారం ఆరాధన, వాక్య పరిచర్య, ప్రత్యేక పాటలు అన్ని సండే స్కూల్ బాల బాలికలచే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్ భూపతి జాషువా, పిడకల హేమ, సంఘ కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, సండే స్కూల్ బాలబాలికలు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యాన ఈనెల 17 సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సహకార సంఘం ఛైర్మన్ అందే నరేన్ తెలిపారు. రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు సందర్భంగా ఈకార్యక్రమం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. కొప్పర్రు, లిఖితపూడి, కె.బేతపూడి తదితర గ్రామ ప్రజల సౌకర్యార్థం ఏలూరు ఆశ్రం ప్రభుత్వ వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రజలు, వృద్ధులు, మహిళలు ఈ ఉచిత కంటి శిబిరంకు హాజరై కంటి పరీక్షలు, కళ్ల అద్దాలు, కంటి ఆపరేషన్లకు కావలసిన పత్రాలను తీసుకుని వచ్చి ఉచిత వైద్య సదుపాయం సద్వినియోగం చేసుకోవలసిందిగా నరేన్ కోరారు. మెగా క్యాంపుకు సంబంధించిన ఏర్పాట్లను సొసైటీ కార్యదర్శి దొడ్డా లక్ష్మణ రావు పరిశీలించారు.

అప్పలరాజు స్వామి అభినందనీయులు

టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

ప్రజాశక్తి - అత్తిలి

మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

గడిచిన ఆరేళ్లలో యుటిఎఫ్ మండల యూనిట్‌కి రథసారథులుగా వ్యవహరించి, ఉపాధ్యాయులకి విశేష సేవలను అందించి నేడు మండల గౌరవ అధ్యక్షులు, సహధ్యక్షులుగా ఎన్నుకోబడిన అప్పలరాజు స్వామి అభినందనీయులని టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. అత్తిలి రామన్నపేట పాఠశాలలో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి గోపీమూర్తి పాల్గొని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఉపన్యసించారు. అనంతరం మండల నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా రమేష్, ఎం.వెంకటరావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రాంభద్రం, జిల్లా కోశాధికారి క్రాంతికుమార్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు రాజేష్, జిల్లా కార్యదర్శి రామకృష్ణంరాజు, రామకృష్ణ, ప్రసాద్, మండల క్యాడర్, అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విప్ నాయకర్ పుట్టినరోజు

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం సౌత్ సెంట్రల్ ప్రాంతంలో విప్ బొమ్మిడి నాయకర్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు ముందుగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేకులు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ కొత్తపల్లి జానకీరామ్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మాజీ సర్పంచి మేళం బన్ను, కుటమి నాయకులు ఉన్నారు.

200 మందికి వైద్య పరీక్షలు

నరసాపురం: మండలంలోని ఎల్‌బి చర్ల గ్రామంలోని శ్రీగంగాలమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీగౌతమి కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యాన వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 200 మందికి షుగర్, బిపి, రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రతినెలా 4వ ఆదివారం ఆలయంలో ఈ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తోట బాబ్జి తెలిపారు. ఈ వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం యాత్రికులతో కలకలలాడింది. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యాన ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.జగదీష్ కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

బాలుడి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - నరసాపురం

సెల్ ఫోన్ చూడవద్దని తల్లి మందలించడంతో ఓ బాలుడు(11) అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన నరసాపురంలో చోటుచేసుకుంది. ఈనెల 14న బాలుడు ఫోన్ పగలగొట్టి వెళ్లిపోయాడని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జయలక్ష్మి తెలిపారు.

బాలుడి ఆచూకీ లభ్యం

ఈనెల 14న ఇంటి నుంచి అలిగి వెళ్లిన బాలుడు కేరళలోని ఎర్నాకులం సౌత్ రైల్వే స్టేషన్ వద్దగల చైల్డ్ ప్రొటెక్షన్ కేంద్రంలో అక్కడి పోలీసుల సంరక్షణలో క్షేమంగా ఉన్నట్లు సమాచారం అందినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రొయ్యల చెరువుల్లో పెరిగిపోతున్న లవణీయత!

- పెరుగుదల లేక గిడసబారి పోతున్న రొయ్యలు
- నష్టాల బారిన రైతులు

పెరుగుదల లేక గిడసబారిన రొయ్యలు

ప్రజాశక్తి - కాళ్ల

రోజురోజుకూ రొయ్యల సాగులో పెరుగుతున్న లవణీయత రైతులను నష్టాలపాలు చేస్తోంది. లవణీయత కారణంగా రొయ్యలు పెరుగుదల లేక గిడసబారిపోతున్నాయి. ప్రతి ఏటా రొయ్యల ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం సుమారు రూ.22 వేల కోట్ల ఆదాయం వస్తోంది. ఈ ఏడాది రొయ్యల సాగు పెరిగింది. చేపలసాగు చేసే రైతులు రొయ్యలసాగు వైపు మక్కువ చూపారు. గడిచిన దశాబ్ద కాలంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది రొయ్యల చెరువుల్లో లవణీయత(సెలినిటీ) పెరిగిపోవడంతో రొయ్యల ఎదుగుదల లోపించింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని ఉప్పుటేరు, కొల్లేరు, సముద్ర తీర గ్రామాల్లో అత్యధిక విస్తీర్ణంలో రొయ్యలు సాగవుతున్నాయి. అల్పపీడనం, మొంథా తుపాను ప్రభావంతో గత 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ప్రతి రోజూ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవడంతో రొయ్యల చెరువుల్లో ఉప్పునీటి శాతం తగ్గిపోయింది. పైగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో చలిగాలుల తీవ్రత కొనసాగింది. ఈనేపథ్యంలో పగటి ఉష్ణోగ్రతలు అత్యల్పానికి పడిపోయాయి. దీని కారణంగా చెరువుల్లోని రొయ్య పిల్లలు ఒత్తిడికి గురై మేత తీసుకోవడం లేదని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు. 24 గంటల పాటు ఏరియేటర్లు తిప్పాల్సి వస్తోంది. తరుచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడడంతో జనరేటర్లపైనా ఆధారపడాల్సి వస్తోంది. పలు గ్రామాల్లో చెరువులు వద్ద నేటికీ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. తద్వారా రోజువారీ పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయని వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఉభయగోదావరి జిల్లాల్లో 2,82,331 ఎకరాల్లో ఆక్వా చెరువులున్నాయి. వీటిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యలు, మిగిలిన విస్తీర్ణంలో చేపల పెంపకం జరుగుతోంది. ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతులు తగ్గుముఖం పట్టడంతో మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టాయి. రొయ్యలు సరిగ్గా ఎదగకపోవడానికి సరైన నాణ్యత లేని సీడ్(పిల్ల రొయ్యలు) హేచరీలలో కలిపే సీడ్‌లో నాణ్యత లోపం కావచ్చు. సరైన సీడ్ వాడకపోవడం, హేచరీల వల్ల రొయ్యల ఎదుగుదల మందగిస్తుంది.

నాణ్యత లేక నష్టాలపాలు..

రొయ్యపిల్లలను వేసి సాగు చేస్తుండగా వాతావరణంలో సంభవిస్తున్న చిన్నపాటి మార్పులకు సైతం తెగుళ్లను తట్టుకోలేకపోతున్నాయి. పలు కారణాలతో సగానికి పైగా పిల్లలు చనిపోతున్నాయి. పంట కాలం ఆరు నుంచి ఏడు నెలలు ఉంటే కనీసం 50 గ్రాములు రావాలి. వ్యాధుల కారణంగా 10 నుంచి 15 గ్రాముల మధ్యలోనే ఎదుగుదల ఆగిపోతోంది. ఎకరాకు రూ.3 లక్షల వరకు పెట్టుబడి అవుతుండగా.. మధ్యలోనే తీయడంతో రాబడి రూ.లక్ష వరకే వస్తోంది. తద్వారా ఎకరాకు రూ.2 లక్షల వరకు నష్టం ఏర్పడుతోంది.

ప్రతికూల వాతావరణంతో రైతుకు ఇక్కట్లు..

ప్రతికూల వాతావరణంతో ఆక్వా రంగం తీవ్రంగా ప్రభావితమవుతోంది. ఉష్ణోగ్రతల్లో తీవ్ర హెచ్చుతగ్గులతో చెరువుల్లో రొయ్యలకు ప్రాణవాయువు లోపం తలెత్తుతోంది. లవణీయత ఒక్కసారిగా పడిపోతోంది. ఇదే పరిస్థితి ఇంకా కొనసాగితే చెరువుల్లో విషవాయువుల ప్రభావం పెరిగే అవకాశం ఉందని ఆక్వా నిపుణులు చెబుతున్నారు. మినరల్స్ స్థాయి వేగంగా పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. వైరస్‌లు, వ్యాధులు ప్రబలి రొయ్యలు మేత తినక ఎదుగుదల నిలిచిపోయి రైతులు రూ.లక్షల్లో నష్టపోయే ప్రమాదం ఏర్పడుతుంది. రొయ్య శీతల రక్తజీవి. చెరువులో నీటి ఉష్ణోగ్రతపై దీని ఎదుగుదల ఆధారపడి ఉంటుంది. 28-32 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఆరోగ్యంగా ఎదుగుతుంది. రాత్రి పూట 25 డిగ్రీల కంటే తక్కువ న మోదవుతున్నాయి. ఇలాంటి దశలో రొయ్యలు ఒత్తిడికి లోనై మేత తినడం తగ్గిస్తుంటాయి. వృథా అయిన మేత చెరువు అడుగుకు చేరుతుంది. తద్వారా అమ్మోనియా, నైట్రేట్ వాయువులు విడుదలై రొయ్యలు చనిపోయే పరిస్థితి ఎదురవుతుంది. వర్షాలతో చెరువుల్లో హానికర బ్యాక్టీరియా శాతం పెరుగుతుంది. దీని ప్రభావంతో రోగ నిరోధకశక్తి తగ్గి వైరస్ సోకి వైట్ స్పాట్, ఫంగస్, గిల్స్, వైట్ గట్ బారినపడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

తగ్గిన రొయ్యల ఎదుగుదల..

లవణీయత పెరుగుతుండడంతో రొయ్యల ఎదుగుదలపై ప్రభావం పడుతోంది. సాధారణ పరిస్థితుల్లో 120 రోజులకు రొయ్యలు పట్టుబడిన వచ్చే పరిస్థితి ఉండగా లవణీయత పెరిగిపోవడంతో రొయ్యల్లో ఆహారం తీసుకొనే సామర్థ్యం తగ్గిపోయి ఎదుగుదల తగ్గిపోతోంది.

జాగ్రత్తలు..

వాతావరణ మార్పులతో వైరస్, బ్యాక్టీరియా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నీటి నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలి. ఈ సీజన్లో రొయ్య ఎదుగుదల నెమ్మదిగా ఉంటుంది. ఎకరా చెరువులో తక్కువ పిల్లలు వేయాలి. మేత తగ్గించాలి. ఏరియేటర్స్ ఎక్కువగా వాడాలి. పిహెచ్ శాతం తగ్గకుండా అగ్రికల్చర్ సున్నం వాడాలి. వ్యాధి సోకిన ప్రాంతాల్లో వెంటనే పట్టుబడి చేయాలి. రైతులు తమకు సీడ్ ఇచ్చే హేచరీల నాణ్యతను సరిచూసుకోవాలి. నాణ్యమైన, సరైన సీడ్‌ను ఎంచుకోవాలి. రైతులు హేచరీల యాజమాన్యాలతో మాట్లాడి నాణ్యతను మెరుగుపరచాలి.

నాణ్యమైన రొయ్య సీడ్ దొరకడం లేదు

అడ్డాల నాగరాజు, ఆక్వా రైతు, కాళ్లకూరు

నాణ్యమైన రొయ్య సీడ్ దొరకడం లేదు. నిపుణుల సలహా తీసుకోవడం జరుగుతుంది. హేచరీ యజమానులు చూపించే ల్యాబ్ రిపోర్టులపై పూర్తిగా ఆధారపడుతున్నాం. రొయ్యసీడ్‌ను పరీక్షించడానికి సరైన ల్యాబ్‌లు లేవు.

లవణీయత పెద్ద సమస్యగా మారింది

ఎం.ఇందిరా ప్రియదర్శిని, మత్స్యశాఖాధికారి, కాళ్ల

అధిక లవణీయత పెరగడంతో రొయ్యలపై ప్రభావం చూపుతోంది. ఎప్పటికప్పుడు లవణీయత పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి. వాతావరణ మార్పులు ఉండడంతో ఆ సమస్య తలెత్తకుండా నిత్యం రొయ్యలను పరీక్షించడం మంచిది.

కొనసాగిన గ్రంథాలయ వారోత్సవాలు

పాలకోడేరులో..

ప్రజాశక్తి - పాలకోడేరు

గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరామయ్య, రంగనాథన్ ఎంతో కృషిచేశారని పాలకోడేరు గ్రంథాలయ అధికారి జెవి.కృష్ణమూర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మహనీయుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహనీయుల విశిష్టతను కృష్ణమూర్తి విద్యార్థులకు తెలియజేశారు.

పెనుమంట్ర : గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్యలను చదువరులు నిరంతరం స్మరణ చేసుకోవాలని మానవత మండల శాఖ అధ్యక్షులు శిరం విశ్వనాధం అన్నారు. ఆదివారం మార్టేరు లైబ్రరీ వారోత్సవ మూడో రోజు కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యమ నేతల చిత్రపటాలకు దండలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుడిమెట్ల రామారెడ్డి, మానవత ఉమ్మడి ప.గో జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణమూర్తి, స్థానిక మానవత కార్యదర్శి బండి ప్రసాద్, పడాల సువర్ణగౌరి పాల్గొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులు చిత్రలేఖనం(గ్లోబల్ వార్మింగ్ మీద) కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి పిటి.శివకుమార్ నిర్వహించారు.

పాలకొల్లు : పాలకొల్లు శాఖ గ్రంథాలయంలో ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. 50 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. రాయకుదురు జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కానుకొలను శ్రీనివాస్ క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

సాయంత్రం అయ్యంకి వెంకట రమణయ్య, పోతుల నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్‌ల జీవిత విశేషాలను, గ్రంథాలయ వ్యవస్థకు చేసిన కృషిని ప్రముఖ పుస్తక రచయిత మాడభూషికృష్ణ ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమాల్లో సత్యవాణి, భాస్కరరావు, కమిటీ సభ్యులు బైలా శ్రీధర్, కొప్పిసీడి కళ్యాణ్ కుమార్, చందన లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు కెవిపి.సత్యనారాయణ, సీతారాం, గ్రంథాలయ అధికారిని వి.శాంతకుమారి పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

నా క్లయింట్ అయిన పరుచూరి గోపి, తండ్రి: సూర్యారావు, రేలంగి, ఇరగవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, సెల్. 84999 60000, ఇచ్చిన సంజాయిషీ మేరకు. నా క్లయింట్ కొనుగోలు చేసి, తణుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ కాబడిన దస్తావేజులు నెం. 4940/2025, 4941/2025, 5083/2025, 5084/2025 లు ది. 11-11-2025న రేలంగిలో జిరాక్స్ నిమిత్తం వెళుతుండగా, మార్గ మధ్యలో పోయినవి. దొరికినవారు తెలియజేయగలరు.

ఇట్లు:
కసాని వెంకన్నబాబు, అడ్వకేట్, రేలంగి, సెల్ 9948292939

వన సమారాధనతో సత్సంబంధాలు పెంపు

పలుచోట్ల వన సమారాధన

ప్రజాశక్తి - గణపవరం

వనసమారాధనల వల్ల స్నేహ సంబంధాలు పెరుగుతాయని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం వల్లూరు శివాలయం ఆవరణలో జరిగిన కార్తీక వనసమారాధనలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీకమాసంలో వన సమారాధనలు జరపటం వల్ల గ్రామాల్లో ప్రజలమధ్య స్నేహ సంబంధాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ముచ్చర్ల వేణుగోపాల్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాళ్ల : కార్తీకమాసంలో వనభోజనం చేయడం ద్వారా ప్రకృతి, దైవాన్ని స్మరించి వెంకటేశ్వరస్వామి ఆశీర్వాదాలు పొందవచ్చని ఆలయ అర్చకులు అనిపెద్ది ఫణిశర్మ అన్నారు. కాళ్లకూరు శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా కాళ్లకూరు గ్రామస్తులు, యాత్రికులు సహకారంతో ఘనంగా జరిగిన కార్తీక వనభోజన వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్, ఆలయసిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను అన్నివిధాలా ఆదుకునేందుకు సంఘం ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చినమిల్లి వెంకటరాయుడు పిలుపునిచ్చారు. కాళ్ల శ్రీకృష్ణ దేవరాయల కాపు సేవా సంఘం ఆధ్వర్యాన కాళ్లలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టుకు పూజలు చేసి కార్తీక వన సమారాధన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాపు సంఘం జిల్లా అధ్యక్షులు చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ మహిళలు చదుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలిచి సంఘ అభివృద్ధికి పాటు పడేందుకు తీర్మానించారు. అనంతరం కార్తీక వన సమారాధన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు వేల మంది వన సమారాధనకు విచ్చేశారు. కార్యక్రమంలో ఆకివీడు ఎఎంసి మాజీ ఛైర్మన్ వానపల్లి బాబురావు, కాళ్ల మండల కాపు సంఘం అధ్యక్షులు పుప్పాల బుజ్జి, గన్నాబత్తుల శ్రీనివాస్, దొడ్డనపూడి గ్రామ సర్పంచి కొల్లి సుబ్బారావు, మాజీ ఉప సర్పంచి కోరా రామ్మూర్తి, టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకటరత్న ప్రసాద్(తాతా పండు), కాళ్ల సొసైటీ ఛైర్మన్ ఎరుబండి రామాంజనేయులు, మాజీ సర్పంచి కట్రెడ్డి శ్రీనివాసరావు, ఆరేటి దిలీప్, జీవి నాగేశ్వరావు మాట్లాడారు. గంటా బాలు, యాతం తేజ, పానకాల కృష్ణ, కాళ్ల ఉప సర్పంచి పన్నాసి వెంకటేశ్వరరావు(అబ్బులు) పాల్గొన్నారు.

పెనుమంట్ర : కార్తీక మాసంలో ఆఖరి ఆదివారం కావడం వల్ల మండలంలోని పలు కుల సంఘాల వారు కార్తీక వన సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పెనుమంట్ర గ్రామంలో సత్యనారాయణ రాజు కుమారుడు దాట్ల భీమరాజు తోటలో ఏర్పాటు చేసిన క్షత్రియ వన భోజన కార్యక్రమంతో పాటు మార్టేరులో విశ్వ బ్రాహ్మణ సంఘం, పంచ గ్రామ రెడ్డి సంఘంతో పాటు పలువురు కులస్తులు వన మహోత్సవం జరిపారు. ఈ నేపథ్యంలో మండలంలోని పలు భోజన హోటల్స్ కొన్ని ముందు జాగ్రత్తగా మూత వేయగా, తెరిచిన హోటల్స్ బేరాలు లేక డీలా పడ్డాయి.

కాళ్లలో..

కాళ్లలో..

మొగల్తూరు : మొగల్తూరులోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య కార్తిక వనసమారాధన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యాన మ్యూజికల్ ఛైర్స్, హౌసీ, అంతాక్షరి తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

సంఘస్తులు తమ చిన్నారులను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రం మొగల్తూరులోని శెట్టిబలిజ గౌడ కార్తీక వన సమారాధన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘీయులు కలిసికట్టుగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అన్ని రంగాల్లోని సంఘస్తులు రాణించాలని సూచించారు. విప్ బొమ్మిడి నాయకర్, నాయకులు వ్యాంద్ర వెంకటస్వామి, తాండ్రేకుల నరసింహారావు, బొక్క రాధాకృష్ణ, పితాని వెంకట్, మేక కోటేశ్వరరావు, కోడి విజయభాస్కరరావు లు సమారాధన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మామిడి చెట్టు సత్యనారాయణ, గొబ్బల నాగరాజు, నారాయణమూర్తి, బాలా రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నరసాపురం : గౌడ, శెట్టి బలిజ సామాజిక తరగతులు రాజకీయ రంగంలో మరింతగా రాణించాలని శాసనమండలి సభ్యుడు కవురు శ్రీనివాస్ అన్నారు. లక్ష్మణేశ్వరం శివాలయం ప్రాంగణంలో సంఘ గౌరవాధ్యక్షుడు కుక్కల మీరయ్య, అధ్యక్షుడు కడలి మోహన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన గౌడ, శెట్టిబలిజ కార్తీక వన సమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంఘీయులు తమ పిల్లలను విద్యావంతులను చేయడం ద్వారా సామాజికంగా ఎంతగానో ముందుకు వెళ్లవచ్చునన్నారు. గౌడ, శెట్టిబలిజ సంఘీయులు సామాజిక, ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టి సమాజంలోని అన్ని తరగతుల ప్రజల అభిమానాన్ని చూరగొనాలన్నారు. సంఘ అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. సమారాధనలో పాల్గొన్న మాజీ ఎంఎల్‌సిలు అంగర రామ్మోహన్, మేకా శేషు బాబు, గౌడ, శెట్టిబలిజ సంఘ జిల్లా అధ్యక్షుడు వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ సంఘీయుల ఐక్యత ద్వారా గౌడ, శెట్టిబలిజ సంఘీయులు రానున్న కాలంలో మరింత రాజకీయంగా ఎదిగేందుకు కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. విద్యా, వైద్య, వ్యాపార రంగాల్లోను ముందుండాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, పితాని వెంకట్, పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ గుబ్బల మార్రాజు, సంఘం పాలకొల్లు ఎఎంసి ఛైర్మన్ కోడి విజయ భాస్కర్, నాయకులు దొంగ మురళీకృష్ణ, కుడిపూడి సత్తిబాబు, కాండ్రేగుల నరసింహరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో ఆదివారం జరిగిన కాపు, తెలగ వన సమారాధనలో విజయవాడ మాజీ ఎంఎల్ఎ వంగవీటి రంగా కుమార్తె ఆశాకిరణ్ పాల్గొన్నారు. ఆమెకు కాపు నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికీ ప్రజల గుండెల్లో రంగా చేసిన సామాజిక కార్యక్రమాలు గుర్తు ఉండటం వల్లనే తనకు ఎక్కడికి వెళ్లినా స్వాగతం పలుకుతున్నారని చెప్పారు. రంగా ఆశయ సాధనకు తాను కూడా కృషి చేస్తానని చెప్పారు. రంగా కుల, మత భేదాలు లేకుండా నిస్వార్థంగా పనిచేసారని చెప్పారు. ఈరోజు నుంచి పబ్లిక్ లైఫ్‌లో తాను ఉంటానని అన్నారు. అయితే తాను ఏ పార్టీలో ప్రస్తుతం చేరడం లేదని ఒకవేళ చేరితే మీడియాకు ముందుగా చెబుతానని చెప్పారు. అదే సమయంలో పాల్గొన్న మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్యను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. వీరు ఉండగానే అక్కడకు విచ్చేసిన మంత్రి నిమ్మల రామానాయుడు కొంతసేపు ఆమెతో మాట్లాడారు. ఇరువురు వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పాలకొల్లులో కాపు కల్యాణ మండపం నిర్మాణంకు తన వంతు కృషిచేస్తానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆదివారం పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్‌లో జరిగిన కాపు, తెలగ వన సమారాధనలో మంత్రి పాల్గొన్నారు. గత కొన్ని దశాబ్దాలుగా కల్యాణ మండపం కోసం కృషిచేస్తున్నా.. కార్యరూపం దాల్చలేదని, అయోధ్య రామమందిరం వలె ప్రతి కుటుంబం నుంచి ఇవ్వగలిగిన రొక్కం ఇస్తే ఇది కార్యరూపం దాల్చుతుందని చెప్పారు. తాను కూడా ప్రభుత్వం నుంచి గ్రాంట్ తెచ్చి 2027 లోపు పూర్తి చేసి వన సమారాధన దానిలో పెట్టుకునేలా కృషి చేస్తానని చెప్పారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని గడప గడపకూ తీసుకెళ్లాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. పోడూరు మండల టిడిపి ముఖ్య శ్రేణుల సమావేశం ఆదివారం పాలకొల్లు కార్యాలయంలో జరిగింది. కూటమి ప్రభుత్వం 16 నెలల పాలనలో చేసిన మంచి పనులను గడపగడపకూ తీసుకువెళ్లాలని మంత్రి కోరారు. ఇదే సమయంలో గత ఐదేళ్ల నియంతృత్వ, నిరంకుశ, కక్షలు, వేధింపులు, కేసులతో రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసంతో పాలన చేసిన వైసిపి మళ్లీ అసత్యాలు, అబద్ధాలతో ప్రజల్లోకి వస్తుందని, దీన్ని ప్రతి ఒక్కరూ నిలదీసేలా వాస్తవాలను తెలపాలన్నారు. రాష్ట్రంలో పరిపాలన దక్షత గల చంద్రబాబు, ఆయనకు తోడు పవన్ కళ్యాణ్, వీరికి అండగా మోడీల కలయిక రాష్ట్రానికి, ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. జగన్ ఐదేళ్ల పాలన విధ్వంసం వైపు సాగగా కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెడుతుందన్నారు. పాలకొల్లు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని మంత్రి రామానాయుడు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు దాసరి రత్నం రాజు, గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, మేడిశెట్టి బుజ్జి, శీలం శ్రీనివాస్, పెనుమత్స రామభద్ర రాజు, ఎల్లమిల్లి వెంకటరావు, కుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

In the Court of the VI Additional District Judge, Kakinada
M.V.O.P. No. 83/2024

Between:
Sangadi Srinivasa Rao @ Srinivas ...*Petitioner*
AND
Gadiraju Suresh Raju & aother ...*Respondents*

To: **Respondents-1:**
Gadiraju Suresh Raju, S/o. Kishore Raju, Recherla Road, D.No. 3-142/3, Prathipadu Village, Pentapadu Mandal, Pin: 534166, W.G.District, Driver and Owner of Bajaj Cargo Van No: AP 39 TS 3953.

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 16-12-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీర వెంకట సత్యనారాయణ
అడ్వకేట్, రామారావుపేట, కాకినాడ, సెల్: 9848252425

In the Court of the VI Additional District Judge, Kakinada (MACT)
M.V.O.P. No. 63/2023

Between:
Pithani Krishna and Others ...*Petitioners*
AND
Shaik Ahmad Basha & others ...*Respondents*

To: **Respondents-2:**
Gannabathula Nagendra, S/o. Venkata Satyanarayana, D.No. 3-117, Ramalayam Street, Chamakurapalem - 534275, Narasapuram, Bhimavaram Dist., Owner of Van No. AP 31 TC 3987,

పై నెంబరు పిటిషన్‌లో 2వ రెస్పాండెంటు అయిన మీకు శ్రీ కోర్టు వారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 02-12-2025 సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని యెడల పై పిటిషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
చిక్కాల వీర వెంకట సత్యనారాయణ
అడ్వకేట్, రామారావుపేట, కాకినాడ, సెల్: 9848252425